జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 18 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 4

## కరాటే లో గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించిన పాల్వంచ విద్యార్ధి



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17,(ప్రజా జ్యోతి)** కరాటే పోటీలో పాల్వంచ డి ఏ వి పాఠశాలకు చెందిన సుదీక్ష అనే విద్యార్థి కరాటే పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు, డి.ఏ.వీ.పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్న పూనెం .సుదీక్ష గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రాంతానికి.డీ.ఏ.వీ.పాఠశాల కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చినందుకు గాను పాఠశాల లో గురువారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నైస్ సాజి, కరాటే కోచ్ మాస్టర్ రాంబాబులు మాట్లాడుతూ హైదరాబాద్ లో 2026 ఏప్రిల్ 26 న నిర్వహించిన కరాటే ప్రదర్శన లో 1212 మంది పాల్గొని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించారని, ఈ రికార్డ్ ప్రదర్శన లో సుదీక్ష కూడా పాల్గొని ప్రతిభ చాటారన్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు..విద్యార్థులు పాల్గొన్నారు.

- రైల్వే, విమాన రవాణా సౌకర్యాల విస్తరణకు చర్యలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



# అన్ని రంగాల్లో కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషి

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17 ,(ప్రజాజ్యోతి)** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించు కొని కొత్తగూడెం జిల్లా ఐడిఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ,సహకార, మార్కెటింగ్ , చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జిల్లాకు విచ్చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.



పేద ప్రజల సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాగునీరు, విద్యుత్, మార్కెటింగ్,

మిగతా 2 లో...

# చర్ల పీహెచ్‌సీలో అధికారుల ఆకస్మిక తనిఖీ



- మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి
- అడిషనల్ డైరెక్టర్ డా. పద్మజ

**చర్ల, సెప్టెంబర్ 17 :(ప్రజా జ్యోతి):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హైదరాబాద్‌కు చెందిన అడిషనల్ డైరెక్టర్ (ఎం అండ్ ఎఫ్) డా. పద్మజ, డీడీ విజయ్ కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మలేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ పరిధిలో నమోదైన పాజిటివ్ కేసులను తప్పనిసరిగా ఫాలోఅప్ చేస్తూ, బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. మలేరియా కేసులు పెరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా యాంటీ లార్వా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.పక్క రాష్ట్రమైన

మిగతా 2 లో...

## బియ్యం పంపిణీ చేయని రేషన్ డీలర్?

- మూడు నెలలకు 40 కేజీలే.. నాలుగైదుసార్లు తిప్పకుంటేనే పంపిణీ!



**అశ్వారావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 17** అశ్వారావుపేట: మండలంలోని పెద్దమిద్దె ప్రాంతంలో నివసిస్తున్న వలస గిరిజన కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. మోద్దులమాడ గ్రామ పరిధిలోని రేషన్ దుకాణంలో నలుగురు సభ్యులున్న కుటుంబానికి నెలకు 24 కేజీల చొప్పున బియ్యం అందాల్సి ఉండగా, మూడు నెలలకు కలిపి కేవలం 40 కేజీలు మాత్రమే ఇచ్చారని పలువురు వలస గిరిజనులు చెబుతున్నారు. బియ్యం కోసం రేషన్ దుకాణానికి నాలుగైదు సార్లు వెళ్లి అడిగితే తప్ప పంపిణీ చేయడం లేదని వారు వాపోతున్నారు. మొద్దుల మాడ నుంచి సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద మిద్దె నుండి నాలుగైదు సార్లు వచ్చి పోతేనే తప్ప బియ్యం పోయట్లేదని రేపు రా మాపురా అని తిప్పించుకొని వెళ్తే తప్ప మాకు బియ్యం అందట్లేదని గిరిజనులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు దీనిపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుకుంటున్నారు.

## కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి ఈసీఐఎల్ సంస్థ చేయూత

- సి ఎస్ ఆర్ ద్వారా రూ67:47 లక్షల విలువ చేసే పరికరాలు అందజేత
- ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17,(ప్రజా జ్యోతి)** (కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ , హైదరాబాద్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా రూ.67.41 లక్షల విలువైన ఆధునిక వైద్య, ఆసుపత్రి పరిశుభ్రత పరికరాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందించింది, ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సమక్షంలో ఈసిఐఎల్ అధికారులు ఈ పరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేశారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా అందజేసిన పరికరాల్లో ఐసీయూ సేవల కోసం 3-ఫంక్షన్ రిమోట్ ఆపరేటెడ్ ఫౌలర్ కాట్స్, నేత్ర వైద్య సేవల కోసం ఆప్తాల్మిక్ ఆపరేటింగ్ మైక్రో



స్కోప్, ఫుట్ అడ్జస్ట్మెంట్ సదుపాయంతో కూడిన ఆప్తాల్మిక్ ఎలక్ట్రిక్ ఆపరేషన్ టేబుల్, ఆర్థోపెడిక్ డ్రిల్ యూనిట్ విత్ యాక్సెసరీస్, వాక్యూమ్ అసిస్టెడ్ క్లోజర్ మెషిన్ లు ఉన్నాయి. అదేవిధంగా ఆసుపత్రి పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు

మిగతా 2 లో...

## కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి ఈసీఐఎల్ సంస్థ చేయూత



(మొదటి పేజీ తరువాయి...)

స్క్రబ్బింగ్ మెషిన్, కాంపాక్ట్ వాక్–బిహైండ్ స్వీపర్, హై–ప్రెజర్ వాషర్ వంటి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సిఎస్ ఆర్ సంస్థల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రులకు అందుతున్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరికరాలతో ఐసీయూ, నేత్ర, ఆర్థోపెడిక్ తదితర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రోగులకు సకాలంలో అవసరమైన వైద్యం అందేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, వైద్య విభాగాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఈసిఐల్ సంస్థ తరపున డైరెక్టర్ (పర్సనల్) కన్నెన్ వి.ఏ.ఎస్., సీఎంఓ & ఇన్చార్జి డా. పి. వేణుబాబు, డిప్యూటీ మేనేజర్ (హెచ్ ఆర్),(సిఎస్ ఆర్ )సునీల్ కుమార్ జె., డిప్యూటీ మేనేజర్ (సివిల్) అనిల్ కుమార్ ఏ., ఈ సి ఓ ఏ అధ్యక్షులు పూర్ణచందర్ పి. ఫోటోగ్రఫీ అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాధామోహన్, సునీత , ఆసుపత్రి సీనియర్ అధికారులు, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చర్ల పీహెచ్‌సీలో అధికారుల ఆకస్మిక తనిఖీ






(మొదటి పేజీ తరువాయి...)

ఛత్తీస్‌గఢ్ నుంచి చర్ల పరిధిలోకి వచ్చే జ్వర పీడితులను తప్పనిసరిగా పరీక్షించాలని, పరీక్షల వివరాలతో ప్రత్యేక జాబితా రూపొందించి రాష్ట్ర స్థాయి అధికారులకు పంపాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుతున్న సిబ్బందిని అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, పీఓ మలేరియా డా. శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. హారిక, హోమియో వైద్యాధికారి డా. పూజ, డీపీఎంఓ పాయం శ్రీనివాసరావు, సీహెచ్ఓ కె. రమాదేవి, ఏఎంఓ పి. కృష్ణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ కె. రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి...)

రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు ఉత్పత్తి, పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా, వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారి, రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు, పాండురంగాపురం నుంచి మాల్కంగిరి వైపు రైల్వే మార్గం అభివృద్ధి ద్వారా భద్రాచలానికి రైల్వే కనెక్టివిటీ కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి–జగదల్‌పూర్ జాతీయ రహదారిని కొత్తగూడెం, భద్రాచలం మీదుగా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొత్తగూడెం–



ఇల్లెందు–హైదరాబాద్ మార్గాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు జిల్లాలోని ఇతర ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని. రహదారి, రైల్వే రవాణాతో పాటు గోదావరి నదీ మార్గం ద్వారా రవాణా అవకాశాలను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం. విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోయంగంగులు సేవలు చిరస్మరణీయం

- జమేదార్ బంజర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సభ



**దమ్మపేట,సెప్టెంబరు,17(ప్రజాజ్యోతి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ సోయంగంగులు సేవలను సీపీఎం నాయకులు స్మరించుకున్నారు. తెలంగాణ వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఎం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో జమేదార్ బంజర్ గ్రామంలోని సోయం గంగులు స్మారక స్థూపం వద్ద గురువారం సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య పార్టీ జెండాను ఆవిష్కరించగా, జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పుల్లయ్య, పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం చారిత్రకమైందన్నారు. ఈ ప్రాంతంలో జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సోయంగంగులు పోరాడి పేదలు, కష్టజీవులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఖండించారు. ఈ పోరాటాన్ని కేవలం మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం సరికాదన్నారు. అనంతరం ఎర్రన్నపేటలో అమరజీవి కామ్రేడ్ కణితి బుల్లయ్య స్మారక స్థూపం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోలోకిపోగు శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, జగన్నాథపు శ్రీనివాసరావు, కౌలూరి రామకృష్ణ, రావుల శోభన్‌బాబు, కణితి బాబూరావు, మిద్దెన బాబూరావు, కణితి లక్ష్మి, మోటేపల్లి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో సదరం, రేషన్ కార్డుల పేరుతో మోసం

**పాల్వంచ, సెప్టెంబర్ 17,(ప్రజా జ్యోతి)** సదరం సర్టిఫికెట్, కొత్త రేషన్ కార్డు, పింఛన్ పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని ఒక వ్యక్తి నమ్మించి భద్రాచలం వద్ద సారపాకలో పలువురు నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది, ఇందులో భాగంగా సరస్వతి అనే మహిళ నుంచి రూ 10, వేలు ,లలిత కుమారి నుండి రూ 60, వేలు, నాగమణి నుండి 13 వేలు మరో బాధితురాలు 70 వేలు మోసపోయినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు, కావున సదరు బాధ్యులపై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## భద్రాచలంలో ఐటి ఉద్యోగిపై రూ. 10 కోట్ల మోసం చేసినట్లు ఆరోపణలు

**పాల్వంచ , సెప్టెంబర్ 17,(ప్రజా జ్యోతి)** భద్రాచలం మెడికల్ కాలేజీకి చెందిన ఓ ఐటీ ఉద్యోగి రూ 10 కోట్లకు పైగా మోసం చేశారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు, అయితే తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు నిందితుడు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిసింది, ఈ క్రమంలో మనస్థాపానికి గురైన ఒక బాధితురాలు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం, నిందితుడు మహిళతో అసభ్యంగా మాట్లాడిన ఆధారాలు కూడా ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు, మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## పాల్వంచలో వ్యక్తి మృతి

**పాల్వంచ: సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి)** పాల్వంచలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది , ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ బాపూజీ నగర్ కు చెందిన నడిమి కంటి దాలి నాయుడు(37) గత 14 సంవత్సరాల క్రితం లక్ష్మి తో వివాహమైంది, అయితే మృతుని భార్య లక్ష్మి విజయవాడలో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తుంది. వీరి మధ్య మూడు నెలల నుండి స్వల్ప విభేదాలు రావడంతో దాలి నాయుడు పాల్వంచలోని తన తండ్రి సింహాద్రి దగ్గరకు వచ్చి నివాసం ఉంటున్నాడు, భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో దాలి నాయుడు మద్యానికి కి బానిస య్యాడు ,ఈ క్రమంలో అతిగా మద్యం సేవించిన నాయుడు బాపూజీ నగర్ లోని ఒక ఇంటి వద్ద కాలువలో పడి మృతి చెందాడు, విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దాలి నాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు , మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు, తండ్రి సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనాథ వ్యక్తి అంత్యక్రియలకు సర్పంచ్ రమాదేవి ఆర్థిక సాయం

**దమ్మపేట,సెప్టెంబరు,17(ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో నిరుపేద, అనాథ వ్యక్తి మృతి చెందడంతో దమ్మపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు మానవతా దృక్పథంతో స్పందించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆపద సమయంలో అండగా నిలిచి, మృతుడి అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించేందుకు రూ.5 వేల విలువైన దహన ఖర్చులకు అవసరమైన సహాయాన్ని అందించారు. నిరుపేద, అనాథ వ్యక్తి అంత్యక్రియలకు ఆర్థికంగా సహకరించి మానవత్వాన్ని చాటిన సర్పంచ్ సేవలను స్థానికులు అభినందించారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్పంచ్ తీరును స్థానికులు ప్రశంసించారు.



# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు







**ఇల్లందు, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఇల్లందులో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, రాష్ట్ర సాధన ఉద్యమం, ప్రజల పాత్రను స్మరించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, డిఎస్పి యువెంకన్న బాబు, మున్సిపల్ కమిషనర్ సందీప్, కాంగ్రెస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ లు స్థానిక జెకె కాలనీ బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడిగూడెంలో వైద్య శిబిరం




**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి):** సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మామిడిగూడెం గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శిబిరంలో సాధారణ దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. జ్వరం ఉన్న వారిని పరీక్షించి ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ (ఆర్‌డీటీ), బ్లడ్ స్మియర్ (బీఎస్) పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు నీటిని కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో మొత్తం 51 మంది వైద్య సేవలు పొందగా, ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సందీప్, ఎంఎల్‌హెచ్‌పీ పి.పార్వతి, హెల్త్ అసిస్టెంట్ టి.వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**చర్ల, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):** భూమి, భుక్తి, విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళల హక్కుల కోసం పోరాటాలను బలోపేతం చేయాలని అన్నారు. చర్లలోని సీపీఎం కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమం నిర్వహించారు. మండల కమిటీ నాయకులు నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు చింతూరు వెంకటరావు, మండల కార్యదర్శి మచ్చా రామారావు, పొదుపుగంటి సమ్మక్క, బందెల చంటి, వరదల వరలక్ష్మి, శ్యామల, చంద్రం, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి పాల్గొనగా ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక అసమానతలు, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, తెగువ తెలంగాణ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. భూమి, ఉపాధి, విద్య, వైద్యం, ఇళ్లు, పెన్షన్లు, రైతుల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామస్థాయి నుంచి ప్రజలను సంఘటితం చేసి ఉద్యమాలను బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టాం స్పందన, కాంతయ్య, ముత్తయ్య, పర్సిక ఆదిలక్ష్మి, భోడిక ధనలక్ష్మి, కుంజా సమ్మక్క, రాధా, పండా లక్ష్మీకాంత్, రాజేష్, పర్సిక జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ -2026




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్17, ( ప్రజా జ్యోతి )** సాంకేతిక విద్యారంగంలో వస్తున్న అనేక తాజా మార్పులకు అనుగుణంగా విద్యార్థులను సంసిద్ధులు చేసి, నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే విధంగా, విద్యార్థులకు ప్రయోగాత్మకంగా తర్ఫీదు ఇచ్చే లక్ష్యంతో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో గురువారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ ఏక్తాన్–2026 కార్యక్రమాన్ని నిర్వహించారు, రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్& ఇంజనీరింగ్ ప్రొఫేసర్ డాక్టర్. జగన్ మోహన్ రాజు హాజరై హ్యాక్ థాన్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఎర్త్ యూనివర్సిటీ సీ. యస్. సీ. విభాగం హెడ్, ప్రొఫేసర్ డాక్టర్. కిషోర్ కుమార్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ టి. భరత్ క్రృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ –2026 ను జాతీయ స్థాయి పోటీలలో పాల్గనడానికి విద్యార్థులను సిద్దం చేసే లక్ష్యంతో ఈ ఇంటర్ననల్ హ్యాక్ థాన్ ను నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలను, స్రృజనాత్మకతను, సమాజంలో సానుకూల ప్రభావం చూపించే పరిష్కార మార్గాలను చూపగలిగేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, డాక్టర్.టి. అవని, డైరెక్టర్ యన్. వి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి, వైస్ ప్రిన్సిపాల్ జి. వెంకన్న, కో ఆర్డినేటర్ డాక్టర్ డి. ప్రణీత్, వివిధ డిపార్ట్మెంట్స్ విగాధిపతులు, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'స్వచ్ఛతా హీ సేవా–2026 కార్యక్రమం నిర్వహణ



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17, (ప్రజా జ్యోతి )** స్వచ్ఛతా హీ సేవా–2026 కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు షెడ్యూల్‌లో భాగంగా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి( ఎస్ ) గ్రామ పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు , పాఠశాల విద్యార్థులక ఎస్వీఎం రూల్స్–2026లో సూచించిన నాలుగు రకాల వ్యర్థాల వేరు వేరు సేకరణ పై అవగాహన కల్పించారు. వ్యర్థాలను మూలస్థాయిలోనే సక్రమంగా వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం , పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలలో , పరిసరాల్లో పరిశుభ్రతను పాటిస్తూ, వ్యర్థాలను వేరు చేసి నిర్వహించేలా చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి( ఎస్ ) గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, పాల్వంచ ఎం పి ఓ, పంచాయతీ కార్యదర్శి, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో మండల స్థాయి క్రీడా పోటీలు



**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి):** చర్ల మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పీ. రమణ తెలిపారు. జడ్పీహెచ్ఎస్ సత్యనారాయణపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన సత్యనారాయణపురం పాఠశాల మైదానంలో పోటీలు జరగనున్నాయి అని 18న అండర్–17 బాలబాలికలకు, 19న అండర్–14 బాలబాలికలకు వివిధ క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు అని చర్ల మండల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఈఎంఆర్ఎస్, ఏహెచ్ఎస్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

## తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ పోషణ

- సీడీపీవో కె.రేవతి



**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి):** పోషణ్ మాహ్–2026లో భాగంగా ఐసీడీఎస్ చర్ల ప్రాజెక్టు పరిధిలోని ఆర్.కొత్తగూడెం సెక్టార్ కూర్నపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సెక్టార్ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌పీ మెనూ బోర్డుల ప్రదర్శనతో పాటు గర్భిణీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో కె.రేవతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలని తెలిపారు. మొదటి 1000 రోజుల్లో అందే పోషకాహారం బిడ్డ ఆరోగ్యం, ఎదుగుదలకు పునాది అని అన్నారు . అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఎస్ఎన్‌పీ మెనూ బోర్డుల ప్రదర్శనతో పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, సెక్టార్ సూపర్‌వైజర్ టీ.ఆదిలక్ష్మి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## సంప్రదాయాలే భావితరాలకు మార్గదర్శకం

- శివ నాగ స్వామి

**చర్ల , సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** భారతీయ సంస్కృతిలో వినాయక చవితికి ప్రత్యేక స్థానం ఉందని నరసాపురం గ్రామంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహా క్షేత్రం చిన్నా అరుణాచలం వ్యవస్థాపకులు శివ నాగ స్వామి అన్నారు. గురువారం మండలంలోని గొంపల్లి, లింగాపురం, లింగాపురం పాడు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడి జన్మవృత్తాంతాన్ని వివరించారు. పార్వతీ దేవి పసుపుతో గణేశుడికి ప్రాణం పోసి ద్వారం వద్ద కాపలాగా ఉంచిందని, అనంతరం శివుడితో జరిగిన ఘర్షణలో గణేశుడి తల తెగిపోవడంతో ఏనుగు తలను అమర్చి శివుడు తిరిగి ప్రాణం పోసినట్లు పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. అప్పటి నుంచి గణేశుడు గజాననుడు, గణపతి, వినాయకుడు, విఘ్నేశ్వరుడు తదితర పేర్లతో పూజలు అందుకుంటున్నారని అన్నారు. విఘ్నాలను తొలగించే దేవుడిగా వినాయకుడిని విశ్వసిస్తూ ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణేశుడిని పూజించడం భారతీయ సంప్రదాయమని అన్నారు. యువత ఆధునిక పోకడలకు లోనుకాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని శివ నాగ స్వామి సూచించారు.



# ప్రజల హక్కులను కాపాడటమే ప్రజాపాలన... సర్పంచ్ రమాదేవి

- దమ్మపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**దమ్మపేట, సెప్టెంబరు, 17 (ప్రజా జ్యోతి):** ప్రజాస్వామ్య పరిపాలన ప్రాధాన్యతను చాటిచెప్పే ప్రజాపాలన దినోత్సవాన్ని దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య పాలనలోకి తెలంగాణ ప్రాంతం అడుగుపెట్టిన సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన నాటి పరిణామాలను గుర్తుచేసుకుంటూ తెలంగాణ హక్కులు, ప్రజల ఆత్మగౌరవం కోసం ఉద్యమించిన మహనీయుల సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలు, హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించడమే నిజమైన ప్రజాపాలన అని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ పాలన కొనసాగిస్తోందని తెలిపారు. అనంతరం గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించడం, పచ్చదనాన్ని కాపాడటంపై సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ పరిశుభ్రత కేవలం పంచాయతీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించినప్పుడే పరిశుభ్రమైన గ్రామం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ల భవాని కృష్ణయాదవ్, చాట్ల శ్రీనివాసరావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పూనెం పోలమ్మ, దాసరోజు సరిత రామారావు, పసుమర్తి కుసుమాంబ, అత్తులూరి వెంకట రామారావు, చిన్నశెట్టి చిట్టిబాబు, ధర్మసోతు నరేష్, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు, శంకరవర అయ్యప్ప, మళ్లా చిన్నా, కొండా ప్రసాద్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- అనుమతి లేకుండా డీజే పెడితే వాహనంతో సహా సీజ్: ఎస్ఐ రాజేష్



**దమ్మపేట, సెప్టెంబరు, 17 (ప్రజాజ్యోతి):** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలకు దమ్మపేట పోలీసులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ దమ్మపేట మండలంలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి వేడుకలకైనా పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే వాహనంతో సహా సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నారులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డీజేలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తే పూర్తి బాధ్యత యజమానులు, నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసినట్లు తెలిస్తే ప్రజలు వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాజేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్ఐ బాలస్వామి, ఏఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

# గిరిజన రిజర్వేషన్ల పెంపు కేసీఆర్ ఘనత

- గిరిజనుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



**దమ్మపేట, సెప్టెంబరు, 17 (ప్రజాజ్యోతి):** గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అశ్వారావుపేట నియోజకవర్గ గిరిజన ప్రజల తరపున మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన జనాభా ఆధారంగా విద్య, ఉద్యోగాల్లో అవకాశాలను మెరుగుపర్చాలనే సదుద్దేశంతో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం వల్ల గిరిజన బిడ్డలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులు దశాబ్దాలుగా చేసిన పోరాటాలను గుర్తించి తండాలు, గూడేలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 26 వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించడంతో పాటు, ఆ భూములకు రైతుబంధు సాయం అందించి గిరిజన రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. గిరి వికాస్ పథకం కింద బోర్లు వేయించి సాగు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎంతోమంది గిరిజనులకు పింఛన్లు అందించామని తెలిపారు. గిరిజనుల కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా గిరిజనులను దారుణంగా మోసం చేసిందని మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తుంటే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేసీఆర్‌కు భూములు ఉన్నాయంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ విమర్శలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, గిరిజనులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# జాతీయ సమైక్యతను కాపాడుకోవాలి: తాటి వెంకటేశ్వర్లు





**దమ్మపేట, సెప్టెంబరు, 17 (ప్రజాజ్యోతి):** జాతీయ సమైక్యత, దేశ సమగ్రత, ప్రజల ఐక్యతను చాటిచెప్పే జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను కొత్తగూడెం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు జాతీయ జెండాను ఆవిష్కరించగా, తాటి వెంకటేశ్వర్లు, రేగా కాంతారావు తదితర నాయకులు జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని తాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన ప్రజలు పరస్పర గౌరవం, ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక సమానత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత కోసం కృషి చేసిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, దిండిగల్ రాజేందర్, రావులపల్లి రాంప్రసాద్, రామకృష్ణ, ప్రభోద్ కుమార్ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

# ఐడిఓసి కార్యాలయంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్
- ఎమ్మెల్యేలు కోరం కనకయ్య_ తెల్లం వెంకట్రావు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 17,(ప్రజా జ్యోతి)** వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఆధ్యాత్మిక భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విరాట్ విశ్వకర్మను దైవస్వరూపంగా భావిస్తూ భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ప్రాచీన కాలం నుంచే విశ్వకర్మలు తమ అపారమైన నైపుణ్యం, శ్రమ, సృజనాత్మకతతో సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారని అన్నారు. కళలు, చేతివృత్తులు, నిర్మాణ రంగాలతో పాటు వివిధ రంగాల్లో విశ్వకర్మలు అందించిన సేవలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ సమాజ నిర్మాణం, అభివృద్ధిలో విశ్వకర్మల పాత్ర ఎంతో విశిష్టమైనదని అన్నారు. తమ నైపుణ్యం, శ్రమ, సృజనాత్మకతతో సమాజానికి సేవలందిస్తున్న విశ్వకర్మలు అభినందనీయులని తెలిపారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో విశ్వకర్మలు తరతరాలుగా అందిస్తున్న సేవలు, వారి వృత్తి నైపుణ్యం, కళా ప్రతిభ ఎంతో గొప్పవని అన్నారు. విశ్వకర్మలు తమ సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి అవసరమైన సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి , జిల్లా అధికారులు, బి.సి. కమ్యూనిటి సంఘనాయకులు కాపర్తి వెంకటాచారి , వారాధి సత్యనారాయణ , నామోజు గోవిందాచారి , ఎలగందుల రామాచారి , అంబుల రామాచారి , బి. సాంబయ్య , ఎస్.కృష్ణమాచారి , పొడిచేటి వెంకటాచారి ప్రముఖులు, వివిధ వృత్తులకు చెందిన కళాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.